థరూర్ వర్సెస్ గెహ్లోట్?

- ఆసక్తికరంగా కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక
- 22 ఏళ్ల తర్వాత తొలిసారి గాంధీయేతర అభ్యర్థులు
- రాహుల్ వైపే పార్టీ శ్రేణుల మొగ్గు

మన్మోహన్ సింగ్ ప్రభుత్వ హయాంలో రిమోట్ ఉన్నట్లే గాంధీ కుటుంబానికి కూడా రిమోట్ కంట్రోల్ ఉంటుంది' అని బీజేపీకి చెందిన షెహజాద్ పూనావాలా అన్నారు.

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి ఎన్నిక అత్యంత ఆసక్తికరంగా మారింది. పార్టీ నేత రాహుల్ గాంధీ ఈ పదవిపై అనాసక్తి ప్రదర్శించడం, ఏడు రాష్ట్రాలకు పైగా పార్టీ శాఖలు రాహులే అధ్యక్షుడిగా ఉండాలని తీర్మానించడం ఒకవైపు అయితే, మరోవైపు, సోనియాతో భేటీ తర్వాత శశి థరూర్ ఏఐసీసీ ఎన్నికల్లో పోటీకి దిగుతారని, రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ కూడా బరిలో ఉంటారన్న వార్తలు ఆ పార్టీ శ్రేణుల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. గాంధీ కుటుంబం పోటీలో పూర్తిగా తటస్థంగా ఉంటుందని సోనియా గాంధీ వెల్లడించినట్లు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో కేరళ ఎంపీ థరూర్, గెహ్లోట్ మధ్య హోరాహోరీ పోటీ తప్పదనే సూచనలు కనిపిస్తున్నాయి. దీంతో 22 ఏళ్ల కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో తొలిసారి ఇద్దరు గాంధీయేతర అభ్యర్థి పోటీకి దిగుతున్నట్లయింది. అయినప్పటికీ, కాంగ్రెస్ కార్యకర్తలలో పెద్ద భాగం ఇప్పటికీ రాహుల్ గాంధీయే తమను నడిపించాలని కోరుతున్నారు. పార్టీ అనేక రాష్ట్ర శాఖలు తీర్మానాలను ఆమోదించాయి. అయితే ప్రస్తుతానికి, రాహుల్ గాంధీ తన నిర్ణయాన్ని పార్టీకి ఇంకా తెలియజేయనందున, ఎంపీ, ముఖ్యమంత్రి మధ్య పోటీ ముఖాముఖిగా ఉంటుంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, గాంధీల మద్దతుతో అశోక్ గెహ్లోట్ అనధికారిక అభ్యర్థి కావచ్చు. అనుభవజ్ఞుడైన నాయకుడు... రాష్ట్రంలో అతని డిప్యూటీ సచిన్ పైలట్ నేతృత్వంలో తన నాయకత్వంపై తిరుగుబాటును, బీజేపీ ప్రలోభ ప్రయత్నాలతో పాటు ఇతర సమస్యలను అధిగమించాడు. అయితే సెప్టెంబర్ చివరి వారంలో గెహ్లోట్ తన నామినేషన్ దాఖలు చేయవచ్చు. రాహుల్ గాంధీ పార్టీ పగ్గాలు చేపట్టాలని ఆయన ఎప్పటి నుంచో పట్టుబడుతున్నారు. తిరువనంతపురం ఎంపీ థరూర్ సన్నిహిత వర్గాలు ఒక వార్తా సంస్థతో మాట్లాడుతూ స్వేచ్ఛాయుతమైన, నిష్పాక్షికమైన ఎన్నికల గురించి ఆమె ఆలోచనను అర్థం చేసుకునేందుకు సోనియా గాంధీని కలవడానికి వెళ్లినట్లు చెప్పారు. సమావేశం తరువాత, సోనియా గాంధీ పూర్తిగా మద్దతు ఇస్తున్నారని థరూర్ అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ ఆలోచనను ఆమె స్వాగతించారని ఆ వర్గాలు వివరించాయి. మరోవైపు, కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల బరిలోకి దిగే అవకాశం ఉందన్న స్పష్టమైన సూచనతో రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ బుధవారం తన పార్టీ ప్రజలు కోరితే నామినేషన్ దాఖలు చేస్తానని, తనకు ఇచ్చిన బాధ్యతను నెరవేరుస్తానని చెప్పారు. ఇదిలాఉండగా, కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలను ప్రతిపక్షాలు బూటకమని అభివర్ణించాయి. 'ఇది కేవలం సౌందర్య ప్రదర్శనల కోసం జరుగుతున్న ఎన్నికలు. కానీ వాస్తవానికి, అది కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికే కాదు.

సోనియా, రాహుల్ అనుమతి అక్కర్లేదు

జైరాం రమేశ్ స్పష్టీకరణ

కోచి: కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు సోనియా గాంధీ లేదా రాహుల్ అనుమతి అవసరం లేదని ఆ పార్టీ బుధవారం పేర్కొంది. గత లోక్ సభ ఎన్నికల్లో పార్టీ ఓటమికి బాధ్యత వహిస్తూ అప్పటి అధ్యక్షుడు రాహుల్ గాంధీ పదవికి రాజీనామా చేశారు. దీంతో సోనియా గాంధీ తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి పూర్తి స్థాయి నాయకత్వ లేమితో పార్టీ ఇబ్బందులు పడుతోంది. అనేకసార్లు రాహుల్ గాంధీనే మళ్లీ పార్టీ పగ్గాలు చేపట్టాలని కాంగ్రెస్ శ్రేణులు ఆయనపై ఒత్తిడిని తీసుకువచ్చాయి. అయితే, రాహుల్ గాంధీ అంగీకరించకపోవడంతో అధ్యక్షుడిని ఎన్నుకోవడానికి ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ ఏర్పాట్లు సిద్ధం చేసింది.

ప్రస్తుతం కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశవ్యాప్త భారత్ జోడో యాత్ర కొనసాగుతోంది. భారత్ జోడో యాత్ర మొదటి, రెండో విడత మధ్య విరామం సందర్భంగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి) జైరాం రమేశ్ మీడియాతో మాట్లాడుతూ... 'కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేయడానికి అందరికీ స్వేచ్ఛ ఉంటుంది. 10 మంది పీసీసీ ప్రతినిధుల నుంచి మద్దతు ఉన్న వారు ఎవరైనా ఎన్నికల్లో పోటీ చేయవచ్చు... నామినేషన్లు దాఖలు చేయడానికి ఎవరికీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీతో పాటు రాహుల్ గాంధీ అనుమతి అవసరం లేదు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరుగుతాయి. దేశంలోని ఏ ఇతర రాజకీయ పార్టీ కూడా తమ పార్టీ అధినేతను ఎన్నుకోవడానికి ఎన్నికలు నిర్వహించదు' అని పేర్కొన్నారు. అదే సమయంలో, కామరాజ్ నమూనా ప్రకారం ఏకాభిప్రాయం ఆధారంగా పార్టీ అధ్యక్షుడిని ఎన్నుకోవడాన్ని తాను విశ్వసిస్తున్నానని జైరాం రమేష్ చెప్పారు. దిగ్గజ కాంగ్రెస్ నాయకుడు కె.కామరాజ్ వ్యాఖ్యలను పునరుద్ఘాటిస్తూ... 'ప్రతి ఒక్కరితో మాట్లాడండి... పార్టీని నడిపించడానికి తగిన ఏకాభిప్రాయ ఎంపికను కనుగొనండి' అని అన్నారు. 'ఏకాభిప్రాయం కుదరకపోతే ఎన్నికలు వాంఛనీయం. మేము ఎన్నికలు నిర్వహించడానికి దూరంగా ఉండటం లేదు' అని ఆయన అన్నారు. అలాగే, ఎవరు బరిలోకి దిగుతారనే దానిపై జైరాం మాట్లాడుతూ, ఎవరు పోటీ చేస్తారో తనకు తెలియదనీ, అయితే తాను మాత్రం పోటీ చేయడం లేదని చెప్పారు. రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ నామినేషన్ దాఖలు చేస్తారో లేదో తనకు తెలియదని, ఒకవేళ చేస్తే ఆ రాష్ట్రంలో ఏమి జరుగుతుందో కూడా తెలియదని అన్నారు. అయితే, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి కాంగ్రెస్ పార్టీకి ఒక వ్యవస్థ ఉందని ఆయన అన్నారు. రాహుల్ గాంధీ ప్రణాళికల గురించి మాట్లాడుతూ... రాహుల్ గాంధీ ప్రస్తుతం భారత్ జోడో యాత్రలో తీరిక లేకుండా ఉన్నారని తెలిపారు. సెప్టెంబర్ 23 యాత్రకు విరామదినం కనుక ఆయన ఢిల్లీకి వెళితే, ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న తన తల్లిని కలుస్తారని వెల్లడించారు. 'రాహుల్ గాంధీ గత 2-3 వారాలుగా తన తల్లిని కలవలేదు. ఆయన కూడా ఒక మనిషే... మీ అమ్మకు ఆరోగ్యం బాగోలేకపోతే మీరు వెళ్లి ఆమెను కలుసుకోరా? ఇప్పుడు నా వద్ద ఉన్న సమాచారం ప్రకారం.. ఆయన ఢిల్లీకి వెళితే, అది అనారోగ్యంతో ఉన్న ఆయన తల్లిని కలవడానికి అయి ఉంటుంది. పార్టీ అధ్యక్ష ఎన్నికలలో నామినేషన్ దాఖలు చేయడానికి కాదు' అని జైరాం స్పష్టం చేశారు. కాగా, కాంగ్రెస్ అధ్యక్ష పోటీలో సీనియర్ నాయకులు అశోక్ గెహ్లోట్, శశి థరూర్ పేర్లు వినిపిస్తున్నాయి.

పీఎం కేర్స్ నిధి ట్రస్టీగా రతన్ టాటా

న్యూఢిల్లీ: పీఎం కేర్స్ ట్రస్టీల్లో ఒకరిగా పారిశ్రామికవేత్త రతన్ టాటా ఎంపికయ్యారు. ట్రస్టుకు ఎంపికయిన ప్రముఖుల్లో టాటా సన్స్ చైర్మన్ సహా మాజీ డిప్యూటీ స్పీకర్ కరియా ముండా, సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి కె.టి.థామస్ ఉన్నారు. పీఎం కేర్స్‌లో అంతర్భాగంగా మారినందుకు ట్రస్టీలను ప్రధాన మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో స్వాగతించింది. కాగా పీఎం కేర్స్ ఇతర ట్రస్టీలుగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఉన్నారు. పీఎం కేర్స్ ట్రస్టీల సమావేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షత వహించిన ఒక రోజు తర్వాత ఈ ప్రకటన వెలువడింది. ఈ సందర్భంగా పీఎం కేర్స్ నిధి సహాయంతో చేపట్టిన వేర్వేరు కార్యక్రమాల పై ఒక ప్రదర్శన జరిగింది. రతన్ టాటా కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. కాగా పీఎం కేర్స్ నిధికి సలహా బోర్డుకు ప్రముఖులను నియమించాలని కూడా ట్రస్టు నిర్ణయించింది. భారత మాజీ కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ రాజీవ్ మెహర్షి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ మాజీ చైర్ పర్సన్ సుధా మూర్తి, టెక్ ఫర్ ఇండియా సహ వ్యవస్థాపకుడు, ఇండికార్ప్స్ అండ్ పిరమిల్ ఫౌండేషన్ మాజీ సీఈవో ఆనంద్ షా ఉన్నారు. సమావేశంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ కొత్త ట్రస్టీలు, సలహాదారుల భాగస్వామ్యం పీఎం కేర్స్ నిధికి విస్తృత దృకోణాలను అందిస్తుందని తెలిపారు.

కేసులు, అరెస్టులే కేంద్రం అజెండా: పవార్

ముంబై: ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టడం, అరెస్టు చేయడమే కేంద్రప్రభుత్వ ప్రధాన అజెండాగా కనిపిస్తోందని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'ఈరోజు వార్తాపత్రికను పరిశీలిస్తే, ప్రతిపక్ష పార్టీలు, నాయకులపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎంత దూకుడుగా ఉన్నాయో వివరంగా ఉంది. ప్రతిపక్ష నేతలపై కేసులు పెట్టడం, అరెస్టు చేయడం కేంద్రం ఎజెండాగా కనిపిస్తోంది... ఎన్నికల్లో ఓడిపోతామన్న సంకేతాలందినప్పుడు కీలక ప్రజాసమస్యల్ని సైతం పక్కనపెట్టి వారు ఈ పనికి అత్యంత ప్రాధాన్యతనిస్తారు' అని పవార్ బుధవారం ఇక్కడ విలేకరులతో అన్నారు. దీనిపై రాజకీయంగా స్పందిస్తామని స్పష్టం చేశారు. ముంబైలోని పత్రా చాల్(పేదల కోసం నిర్మించిన గృహ సముదాయాలు) పునరాభివృద్ధి ప్రాజెక్ట్ కేసులో ప్రధాన సాక్షి ఒకరు... శివసేన ఎంపీ సంజయ్ రౌత్ నిందితుడిగా ఉన్న మనీలాండరింగ్ కేసును దర్యాప్తు చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు ఏం చెప్పారంటే... చాల్ పునరాభివృద్ధి కోసం 2008-09 సమయంలో కొంతమంది నివాసితులు స్థానిక రాజకీయ నాయకుల ద్వారా పవార్‌ను సంప్రదించారని చెప్పారు. హెచ్‌డిఐఎల్ (హౌసింగ్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్)కి చెందిన రాకేష్ వాధ్వాన్‌తోపాటు సంజయ్ రౌత్, ప్రవీణ్ రౌత్‌తో అనేక సమావేశాల అనంతరం ఈ ప్రాజెక్ట్‌ను నిర్వహించాల్సిందిగా కోరినట్లు ఆమె అనుబంధ ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీకి తెలిపారు. 2019 అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈడీ పవార్‌కు నోటీసులు జారీ చేసింది. అయితే విచారణకు పవార్ హాజరు కానవసరం లేదని ఈడీ ఆ తర్వాత తెలిపింది.

కాంగ్రెస్ సభ్యుల సస్పెన్షన్

గాంధీనగర్: గుజరాత్‌లో పాలక బీజేపీ...సమస్యలపై గళమెత్తిన ప్రతిపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు వేసింది. బుధవారం శాసనసభ కార్యకలాపాలు ప్రారంభమైన వెంటనే ప్రభుత్వ ఉద్యోగులు, రైతులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మాజీ సైనికోద్యోగుల సమస్యలపై అరగంట పాటు ప్రత్యేకంగా చర్చించాలని ప్రతిపక్ష నేత సుఖ్‌రామ్ రథ్వా డిమాండ్ చేశారు. స్పీకర్ నిమాబెన్ ఆచార్య రథ్వా సుఖ్‌రామ్ డిమాండ్‌ను తిరస్కరించడంతో, స్వతంత్ర ఎమ్మెల్యే జిగ్నేష్ మేవానీ, ఇతర కాంగ్రెస్ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం దగ్గరకు చేరుకుని ఆందోళనకు దిగారు. ప్లకార్డులు చేతబట్టి 'ఉద్యోగులకు న్యాయం చేయండి', 'అటవీ సిబ్బందికి న్యాయం చేయండి', 'మాజీ సైనికులకు న్యాయం చేయండి' అంటూ నినదించారు. దాదాపు అన్ని శాఖల ఉద్యోగులు అపరిష్కృత సమస్యలపై ఆందోళన చేస్తుంటే, సభలో చర్చకు బీజేపీ ఎందుకు సిద్ధంగా లేదని ప్రతిపక్ష సభ్యుల నినాదాల నడుమ ఉప ప్రతిపక్ష నేత శైలేష్ పర్మార్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తమ తమ స్థానాల్లోకి వెళ్లి కూర్చోవలసిందిగా స్పీకర్ అనేకమార్లు కోరినా ప్రతిపక్ష ఎమ్మెల్యేలు నిరాకరించి, పోడియం వద్ద బైఠాయించడంతో గుజరాత్ శాసనసభ వ్యవహారాల మంత్రి రాజేంద్ర త్రివేది ప్రతిపక్ష శాసనసభ్యులను సభ నుంచి సస్పెండ్ చేయాలని ప్రతిపాదించారు. దీంతో స్పీకర్ మెజారిటీ వాయిస్ ఓటుతో మేవానీతో పాటు మరో 14 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ఒకరోజు సభ నుంచి సస్పెండ్ చేశారు. దీంతో వారిని మార్షల్స్ బలవంతంగా సభ వెలుపలకు తరలించారు.

జోడో యాత్రను అడుగు పెట్టనివ్వం: బీజేపీ

భోపాల్: మధ్యప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మీడియా సెల్ చైర్మన్ కేకే మిశ్రా చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై బీజేపీ నిరసన వ్యక్తం చేసింది. పార్టీ నుంచి మిశ్రాను తొలగించకుంటే రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర'ను మధ్యప్రదేశ్‌లో అడుగుపెట్టనీయమని హెచ్చరించింది. కేకే మిశ్రా బ్రాహ్మణ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారంటూ ఆయనపై బీజేపీ నిప్పులు చెరుగుతోంది. అయితే, ఈ వాదనను మిశ్రా కొట్టివేశారు. దేశవ్యాప్తంగా రాహుల్ చేపట్టిన యాత్రకు భారీ స్పందన వస్తుండటం చూసి తట్టుకోలేకనే తన వ్యాఖ్యలను వక్రీకరించి ఆరోపణలు చేస్తున్నారన్నారు. మిశ్రా ఒక ఇంటర్వ్యూలో మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, తాను బ్రాహ్మణుడిగా గర్విస్తున్నానని, అయితే అన్నిటికన్నా మానవత్వమే గొప్పదని, తప్పులు చేస్తే బ్రాహ్మణులైనా సరే తాను సమర్థించలేనన్నారు. ఆయన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బీజేపీ భోపాల్ జిల్లా అధ్యక్షుడు సుమిత్ పచౌరి నేతృత్వంలోని ఆ పార్టీ కార్యకర్తలు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు కమల్ నాథ్ నివాసం ముందు నిరసనకు దిగారు. మిశ్రాను పార్టీ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మిశ్రాపై చర్యలు తీసుకోకుంటే రాహుల్ 'భారత్ జోడో యాత్ర'ను మధ్యప్రదేశ్‌లోకి అడుగు పెట్టనీయమని హెచ్చరించారు. మిశ్రాను తక్షణం పార్టీ నుంచి తొలగించాలంటూ ఒక విజ్ఞాపన పత్రాన్ని కమల్‌నాథ్‌కు అందజేశారు. అసలేమి జరిగిందో తాను తెలుసుకుని తగిన చర్యలు తీసుకుంటానని కమల్‌నాథ్ వారికి హామీ ఇచ్చారు.

బెంగాల్ ఐపీఎస్‌లకు ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్ బొగ్గు కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులకు సమన్లు జారీ చేసింది. బెంగాల్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు, ప్రత్యేక టాస్క్ ఫోర్స్ చీఫ్ గైనవంత్ సింగ్, కోల్‌కతా డిప్యూటీ పోలీసు కమిషనర్ ఆకాశ్ మగారియా విచారణకు రావాలని ఈడీ కోరింది. గైనవంత్ సింగ్ ఈనెల 26న, మరో ఐపీఎస్ అధికారి ఆకాశ్ మగారియా ఈనెల 28న విచారణకు హాజరు కావాలని ఈడీ బుధవారం జారీ చేసిన సమన్లలో కోరింది. బొగ్గు అక్రమ తవ్వకాలు, రవాణా, విక్రయాలపై సీబీఐ, ఈడీలు దర్యాప్తు చేస్తున్నాయి. ఈ ఇద్దరు ఐపీఎస్ అధికారులు గతంలో కోల్ బెల్టు ప్రాంతంలో పనిచేశారని, ఆ సమయంలో వారికి బొగ్గు స్మగ్లింగ్ గురించి తెలుసా అని ఈడీ వీరిని ప్రశ్నించనుంది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అనేమంది సీనియర్ నేతలు ఈ బొగ్గు స్కాంలో నిందితులుగా ఈడీ విచారణను ఎదుర్కొంటున్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

నలుగురి మృతి... మరో ముగ్గురికి గాయాలు

న్యూఢిల్లీ: దేశ రాజధాని నగరమైన ఢిల్లీలో బుధవారం తెల్లవారుజామున దారుణ ఘటన జరిగింది. ఢిల్లీ నగరంలోని సీమాపురి రోడ్డు డివైడరుపై నిద్రిస్తున్న వారిపై వేగంగా వచ్చిన ట్రక్కు దూసుకుపోయింది. ఈ ఘటనలో నిద్రపోతున్న వారిలో నలుగురు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. నిద్రపోతున్న వారిపైకి దూసుకెళ్లి ప్రాణాలు బలిగొన్న ట్రక్కును కనుగొనేందుకు ఢిల్లీ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గాయపడ్డవారిని జీటీబీ ఆసుపత్రికి తరలించారు. నిద్రపోతున్న వారిపైకి ట్రక్కు దూసుకురావడంతో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. గాయపడ్డ మరో వ్యక్తి మార్గమధ్యంలో మరణించాడు. మరో వ్యక్తికి చికిత్స అందిస్తుండగా ప్రాణాలు కోల్పోయాడు. వేగంగా వస్తున్న ట్రక్కు సీమపురిలోని డీటీసీ డిపో వద్ద రెడ్ లైట్‌ను క్రాస్ చేస్తూ నిద్రపోతున్న వారిపైకి దూసుకెళ్లింది.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు: మాయావతి

లక్నో: ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా యూపీ అధికార బీజేపీ పాలన సాగిస్తోందని బీఎస్పీ అధినేత్రి మాయావతి పేర్కొన్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ అధికార బీజేపీని నిలువరించడంలో విఫలమైందని ఆరోపించారు. మంగళవారం సమాజ్‌వాదీ పార్టీ చేపట్టిన ఆందోళనను ప్రభుత్వం అడ్డుకోవడంతో స్పందించిన మాయావతి ప్రతిపక్షాల గొంతు నొక్కడాన్ని తప్పుపడుతూ చేసిన ట్వీట్ రాజకీయ వర్గాల్లో సంచలనం అయింది. సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ మధ్య పొత్తు ఉంటుందనే ఊహాగానాలు ప్రారంభమైన నేపథ్యంలో మాయావతి తాజాగా సమాజ్‌వాదీ పార్టీ ప్రతిపక్షంగా విఫలమైందని ఆరోపించడం ఆసక్తిగా మారింది. పొత్తులపై వస్తున్న ఊహాగానాలకు తెరదించాలని భావించిన ఆమె ఎస్పీని కూడా టార్గెట్ చేసినట్టు స్పష్టమవుతోంది. ఈ క్రమంలో ఉత్తరప్రదేశ్‌లోని లౌకిక శక్తులు బీజేపీ అనుసరిస్తున్న కులతత్వ, మతతత్వ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఎస్పీకి ఓట్లు వేశారని ట్వీట్ చేశారు. ప్రధాన ప్రతిపక్షంగా ఎస్పీకి అవకాశం ఇచ్చారని, అసెంబ్లీలోనూ బలం ఉన్నా ఆ పార్టీ చాలా నిస్సహాయ స్థితిలో ఉందని పేర్కొన్నారు. బీజేపీ సాగిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను నిలువరించడంలో తీవ్రంగా విఫలమైన ప్రతిపక్షం తీరు ఆందోళన కలిగించే అంశమని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.

ముక్తార్ అన్సారీకి రెండేళ్ల జైలు

లక్నో: జైలర్‌ను తుపాకీతో బెదిరించిన కేసులో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వివాదాస్పద నేత ముక్తార్ అన్సారీకి రెండేళ్ల జైలుశిక్ష పడింది. ఈ మేరకు బుధవారం అలహాబాద్ కోర్టు తీర్పు వెలువరించింది. గతేడాది ముక్తార్ అన్సారీ అప్పగింతకు సంబంధించి పంజాబ్-ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాల మధ్య తీవ్ర వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. 2003లో ఖైదీగా ఉన్న ముక్తార్ అన్సారీని కలిసేందుకు వచ్చేవారిని తనిఖీలు చేయాలని నాటి జిల్లా జైల్‌లోని జైలర్ ఎస్‌కే అవస్థి ఆదేశించారు. దీంతో ఆగ్రహించిన అన్సారీ అతడిని తుపాకీతో బెదిరించారు. ఈ ఘటనపై ఆలంబాగ్ పోలీసులు కేసు నమోదు చేశారు. కింది కోర్టుల్లో అన్సారీ నిర్దోషిగా బయటకు రాగా.. ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లడంతో శిక్షపడింది. అన్సారీకి సంబంధించి డజనుకుపైగా కేసుల్లో విచారణ జరుగుతోంది. అతడిపై యూపీలోనే 52 కేసులు ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని 'మావు' నియోజకవర్గం నుంచి గతంలో అన్సారీ ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాడు. ఆయనపై ఘజియాబాద్ జిల్లాలోనే దాదాపు 38కి పైగా కేసులు నమోదయ్యాయి. అన్నీ తీవ్రమైన నేరాలకు సంబంధించినవే. 2005లో జరిగిన బీజేపీ ఎమ్మెల్యే కృష్ణానంద్ రాయ్ హత్య కేసులోని ప్రధాన నిందితుల్లో ముక్తార్ ఒకడు. 2009లో జరిగిన ఓ జంట హత్య కేసులో కూడా నిందితుడిగా ఉన్నాడు. 2019లో జైలు నుంచి ఫోన్ చేసి పంజాబ్‌లోని ఓ వ్యాపారవేత్తను బెదిరించినట్లు ఆరోపణలు వచ్చాయి.

పంజాబ్‌లో మరో విద్యార్థి ఆత్మహత్య

ఆందోళనకు దిగిన విద్యార్థులు

ఫగ్వారా: పంజాబ్‌లోని ఓ ప్రైవేట్ యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పూర్తి వివరాల్లోకి వెళితే రాష్ట్రంలోని ఫగ్వారాలోని లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ డిజైనింగ్ విభాగంలో మొదటి సంవత్సరం చదువుతున్న కేరళకు చెందిన విద్యార్థి ఈ నెల 20న ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి ఆత్మహత్య విషయం తెలుసుకున్న సహచర విద్యార్థులు అర్ధరాత్రి వేళ క్యాంపస్‌లో ఆందోళన చేపట్టారు. విద్యార్థి మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. వర్సిటీ సెక్యూరిటీ గార్డులు విద్యార్థులను శాంతింప చేసే ప్రయత్నాలు ఫలించలేదు. విద్యార్థి మృతికి న్యాయం చేయాలని డిమాండు చేశారు. ఈ వ్యవహారం పోలీసుల వరకూ వెళ్లింది. ఫగ్వారా డీసీపీ జస్ప్రీత్ సింగ్ అక్కడకు చేరుకుని విద్యార్థి ఆత్మహత్య ఘటనపై విచారణ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడుతూ రాసిన సూసైడ్ నోట్ ప్రకారం అతను వ్యక్తిగత సమస్యలను ఎదుర్కొంటున్నట్టు తెలిసిందని చెప్పారు. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. వారి ఫిర్యాదు ఆధారంగా తదుపరి విచారణ చేపట్టనున్నట్టు తెలిపారు. వర్సిటీలో ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో క్యాంపస్‌లో పోలీసులను మోహరించినట్టు తెలిపారు. విషయం సీరియస్ అవుతుండడంతో రాష్ట్ర డీజీజీ భూపతి ఉన్నతాధికారులతో కలసి ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇదిలా ఉండగా క్యాంపస్‌లోకి జర్నలిస్టులను అనుమతించకపోవడంతో ఆత్మహత్యపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థి మృతి దురదృష్టకరం అని వర్సిటీ యాజమాన్యం పేర్కొంది."విచారణకు అన్ని విధాల సహకరిస్తామని ట్వీట్ చేసింది.

రైతు మరణాలకు బీజేపీ విధానాలే కారణం: సుప్రియ

న్యూఢిల్లీ: దేశంలో రైతుల బలవన్మరణాలకు బీజేపీ ప్రభుత్వ విధానాలే కారణమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. దేశంలో ప్రతి గంటకు ఒక రైతు ఆత్మహత్యకు పాల్పడుతున్నాడని పేర్కొంది. ఇటీవల పుణెలో ఆత్మహత్య చేసుకున్న ఓ రైతు ఘటనను ప్రస్తావించిన కాంగ్రెస్.. తన చావుకు బీజేపీ విధానాలే కారణమంటూ సూసైడ్ నోట్‌లో ఆ బాధితుడు పేర్కొన్న విషయాన్ని ఎత్తిచూపింది.

'దేశవ్యాప్తంగా గతేడాది లక్షా 64వేల మంది ఆత్మహత్యలకు పాల్పడగా..అందులో 10,881 మంది వ్యవసాయ రంగంలో ఉన్నవారే. దీన్నిబట్టి నిత్యం 30 మంది రైతులు బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్నారు. ఇలా ప్రతి గంటకు ఓ రైతు ప్రాణం తీసుకుంటున్నాడు' అని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనతే పేర్కొన్నారు. నేషనల్ క్రైమ్స్ రికార్డ్స్ బ్యూరో నివేదికలను ప్రస్తావించిన ఆమె.. 2014-2021 మధ్య కాలంలో దేశంలో 53,881 మంది రైతులు బలవన్మరణాలకు పాల్పడ్డారని గుర్తుచేశారు. నిత్యం 21 మంది అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రకటనలు ఇస్తోన్న ప్రభుత్వం.. ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. దేశంలో అన్నదాతల ఆత్మహత్యలకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించిన సుప్రియా.. ఇందుకు ప్రభుత్వ విధానాలే కారణమన్నారు. సాగు చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతూ గతేడాది దాదాపు 700 మంది రైతులు ప్రాణాలు కోల్పోయిన విషయాన్ని సుప్రియ గుర్తుచేశారు. వీటన్నింటిని చూస్తే.. రైతులు, వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనే విషయం స్పష్టమవుతోందని విమర్శించారు. మరోవైపు డీజిల్ ధరలు పెంచడంతోపాటు ఫర్టిలైజర్లు, ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ భారం వేస్తూ రైతులను బీజేపీ ప్రభుత్వం లూటీ చేస్తోందని ఆరోపించారు.

మమత సర్కారుకు ఆర్థిక కష్టాలు

- కేంద్రం మొండిచేయి
- పరిశ్రమలు రావు...పెట్టుబడులు లేవు
- నిధులు లేక సంక్షేమానికి అడ్డుకట్ట
- భూముల వేలానికి ప్రభుత్వ సన్నాహాలు
- అగ్నిపరీక్షగా పంచాయతీ ఎన్నికలు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ ఆర్థిక పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కేంద్రప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడం, రాష్ట్ర ఆదాయం కంటే ఖర్చు ఎక్కువగా ఉండటం మమతా బెనర్జీ ప్రభుత్వానికి పెద్ద సమస్యగా మారింది. పారిశ్రామికీకరణలో పశ్చిమ బెంగాల్ వెనుకబడి ఉంది. ఎన్నికల్లో గెలుపు లక్ష్యంగా మమతా బెనర్జీ ఇచ్చిన హామీల అమలు సందిగ్ధంలో పడ్డాయి. కేంద్రప్రభుత్వం మొండిచేయి చూపుతుండటంతో ఇచ్చిన హామీ ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేయలేని పరిస్థితి మమత సర్కార్‌ను కలవరపెడుతోంది. సంక్షేమాన్ని కొనసాగించాలంటే రాష్ట్ర ఆదాయాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఉందిగానీ అదెలా సాధ్యం? రాష్ట్రంలో పెద్ద పరిశ్రమలు లేవు. పెట్టుబడులు రావు. పారిశ్రామికీకరణకు తొలి ప్రాధాన్యత ఇస్తానంటూ మమతా బెనర్జీ 2011 నుంచి 2022 వరకు చాలాసార్లు ప్రకటించారుగానీ ఆచరించలేకపోయారు. ఒక్కమాటలో చెప్పాలంటే టీఎంసీ ప్రభుత్వం అప్పుల ఊబిలో చిక్కుకొని ఉంది. రూ.69,511 కోట్ల రుణం ప్రభుత్వంపై ఉంది. పశ్చిమ బెంగాల్‌లో పరిశ్రమలు, వ్యాపారాలకు అనుకూల పరిస్థితి లేదని గణాంకాలు చెబుతున్నాయి. ఆనంద బజార్ పత్రిక, పశ్చిమ బెంగాల్ వార్షిక బడ్జెట్-2023; కేంద్ర పరిశ్రమల శాఖ గణాంకాలను బట్టి జనవరి నుంచి జులై వరకు భారత్‌కు రూ.1.7లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇందులో ఒక శాతం కంటే తక్కువగా రూ.1,663 కోట్లు పశ్చిమ బెంగాల్‌కు అందింది. టీఎంసీ ప్రభుత్వ ఆదాయం ఎస్‌జీఎస్టీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ రుసుము, పెట్రోల్, డీజిల్‌పై సేల్స్ ట్యాక్స్, ఎక్సైజ్ సుంకంపైనే ఆధారపడి ఉంది. గ్రామీణ ఉపాధి హామీ పనులు, నిధులు లేక పశ్చిమ బెంగాల్‌లో సమస్యలు మరింతగా పెరిగాయి. పారిశ్రామికీకరణలో వెనుకబడిన ఈ రాష్ట్రంలో సంక్షేమ పథకాల అమలుకు అడ్డుకట్ట పడింది. పర్యవసానంగా సామాజిక, రాజకీయంగా ఆందోళనకర పరిస్థితులు నెలకొన్నాయి. ఇక ఏప్రిల్-మే నెలల్లో జరగాల్సి ఉన్న పంచాయతీ ఎన్నికలు టీఎంసీకి అగ్నిపరీక్షగా మారాయి. ప్రస్తుత పరిస్థితి కొనసాగి కేంద్రప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే మమతా బెనర్జీ ప్రభుత్వానికి క్షేత్రస్థాయిలో గడ్డుపరిస్థితి తప్పబోదు. విషయాన్ని గ్రహించిన ముఖ్యమంత్రి, టీఎంసీ చైర్‌పర్సన్ అందుకు తగ్గట్లుగా చర్యలు తీసుకుంటున్నారు. ఆదాయ మార్గాలను కనుగొనాలని వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులను కోరుతున్నారు. రుణ సామర్థ్యం పెంచుకునేందుకు ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టాన్ని సవరిస్తున్నారు. తద్వారా మరిన్ని రుణాలు పొందాలని భావిస్తున్నారు. సంక్షేమ పథకాల కోసం రూ.8000 కోట్లు సమకూర్చేందుకు బెంగాల్ వ్యాప్తంగా 32 భూములను ఆన్‌లైన్‌లో వేలం వేయాలని మమత సర్కార్ భావిస్తోందని ప్రముఖ ఆంగ్ల పత్రిక వెల్లడించింది.

మరోవైపు రాష్ట్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ పథకంపై అధికంగా ఆధారపడుతుంది. మమతా బెనర్జీ 'లాభారతి' (ప్రయోజనం/లబ్ధి) రాజకీయాల గొంతు నులుపివేయాలని బీజేపీ యత్నిస్తుంది. ఇటీవల బెంగాల్‌కు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ కేంద్ర నిధులను బీజేపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఈ పథకంలో తీవ్రస్థాయిలో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపించింది. ఇతర కేంద్రపథకాలు సైతం రాష్ట్ర ప్రభుత్వ పథకాలన్నట్లుగా అమలవుతున్నట్లు కేంద్రం పేర్కొంది. దీంతో పరిస్థితిని అర్థం చేసుకున్న టీఎంసీ ప్రభుత్వం కేంద్రప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించే ప్రయత్నం చేస్తోంది. ఇదే క్రమంలో అవినీతి, జిల్లా పరిషత్ సభ్యులు అక్రమంగా ఆర్జించినదంతా వసూలు చేయాలని మమత సర్కార్‌కు కేంద్రం ఆదేశాలిచ్చింది. 2021 డిసెంబరు నుంచి నిధుల కొరత కారణంగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు చాలా రాష్ట్రాల్లో దాదాపు నిలిచిపోయాయి. పశ్చిమ బెంగాల్‌లో పరిస్థితిని స్వయంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీయే ప్రధాని మోదీ దృష్టికి తీసుకు వెళ్లినా ఫలితం లేదు.